క్లుప్తంగా

కళాశాల ఏర్పాటు చేయాలి

కురవి: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్, ఎల్‌ఎస్‌ఓ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ శివవర్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ సునీల్‌రెడ్డికి జూనియర్ కాలేజీ ఏర్పాటు కోసం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, రమేశ్, ప్రకాశ్, విజయ్, గణేష్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని రైతులు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంఘం అధ్యక్షుడు చల్ల లింగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో శనివారం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహాజన సభ తీర్మానాలను ధ్రువీకరించి ఆమోదించారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, యాకయ్య, రైతులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

కురవి/డోర్నకల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కురవి, సీరోలు, డోర్నకల్ మండలాల్లోని వివిధ గ్రామాల్లోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను మహబూబాబాద్ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ శనివారం పంపిణీ చేశారు.

డాక్టరేట్ ప్రదానం



దంతాలపల్లి: మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన మిడుతపల్లి చిరంజీవి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. పోలెన్ ఐడెంటిఫికేషన్ అండ్ డైవర్సిటీ ఇన్ సెలెక్టెడ్ మెడిసినల్, ప్లాంట్స్ ఆఫ్ హైదరాబాద్, తెలంగాణ(వృక్షశాస్త్రం) విభాగంలో డాక్టరేట్ వచ్చినట్లు చిరంజీవి శనివారం తెలిపారు.

మహిళ అదృశ్యం



గూడూరు: ఓ మహిళ అదృశ్యమైన సంఘటన మండలంలోని మచ్చర్ల శివారు కొమురం భీంనగర్‌లో జరిగినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి శనివారం తెలిపారు. వివరాల ప్రకారం నూనావత్ అంసి అనే మహిళ తన భర్తతో శుక్రవారం గొడవపడింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి బయటికి వెళ్లింది. రాత్రి వరకు తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికారు. ఎంతకూ ఆమె ఆచూకీ తెలియకపోవడంతో కుమారుడు మంగీలాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభం

బయ్యారం: వేసవిలో మండలకేంద్రంలో విద్యుత్‌సమస్యలు రాకుండా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లతో పరిష్కారం కలిగిందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండల కేంద్రంలో ఐదు చోట్ల ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు.

తైబజార్ వేలం

తొర్రూరు: మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మున్సిపాలిటీ తైబజార్ వేలంపాటలో రూ.3.18లక్షలకు కొలుపుల రాంచందర్ తైబజార్‌ను దక్కించుకున్నాడు.

బ్రాహ్మణులకు అండగా ప్రభుత్వం

తొర్రూరు: బ్రాహ్మణులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తోందని బోప్పా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలోని పాటిమీది ఆలయంలో ఉగాది పంచాగంను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రమణారావు, గంగు నవీన్‌శర్మ, లక్ష్మణాచార్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆహ్వానపత్రం అందజేత

తొర్రూరు రూరల్: మండలంలోని అరిపిరాల గ్రామంలో వచ్చే నెల 11న మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి రావాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిలకు ఆహ్వానపత్రాన్ని శనివారం అందించారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, నారాయణ, సధాకర్, రావుల రణధీర్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా..

- మరిపెడ మున్సిపల్ కమిషనర్ కంచర్ల నరేష్‌రెడ్డి
- 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన
- తీవ్రంగా కోతులు, కుక్కల బెడద
- పారిశుద్ధ్య లోపంతో ప్రజల ఇబ్బందులు



ఫోన్‌ఇన్ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని పలు వీధులలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కంచర్ల నరేష్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో 'సాక్షి' ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించగా ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

ప్రశ్న: పార్కుల వెంట వాకర్స్‌కు సౌకర్యాలు కల్పించాలి. పార్కులు ఉన్నా వాకర్స్ నడిచే పరిస్థితుల్లో లేరు. – దేవరశెట్టిలక్ష్మీనారాయణ, బోడశ్రీను

కమిషనర్: కొత్తగా గ్రాంట్స్ వస్తే తప్పకుండా వాకర్స్‌కు అన్ని విధాలుగా ఇబ్బందులు లేకుండా చూస్తా.

ప్రశ్న: పదకొండో వార్డులో బోర్ ఉన్నా విద్యుత్ వైర్లు దూరంగా ఉండడంతో తరచు మోటార్ కాలిపోతుంది. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. – షేక్ తాజుద్దీన్ 11వ వార్డు

కమిషనర్: విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తా.

ప్రశ్న: మున్సిపాలిటీ కేంద్రంలోని శాంతి థియేటర్ సమీపంలో రోడ్డుపై సిమెంట్ పోల్స్ పాతడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. – రాజేష్ 7వ వార్డు

కమిషనర్: అక్రమంగా రోడ్డుకు అడ్డంగా పాతితే చర్యలు తీసుకుంటాం. స్థానికంగా పరిశీలిస్తాం.

ప్రశ్న: స్థానిక కార్గిల్ సెంటర్‌లో డ్రెయినేజీలో నీరు నిలిచి ఉండడం వల్ల దోమలు, ఈగలతో ఇబ్బందిగా మారుతుంది. – శ్రీనవాస్ 9వ వార్డు

కమిషనర్: కాలువలు శుభ్రం చేయించి ఫాగింగ్ చేయిస్తా. సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న: మరిపెడలో ఉన్న వెంచర్లలో ఇళ్లు నిర్మించుకుంటున్నారు. వాటికి మున్సిపాలిటీ పర్మిషన్ ఉందా? – రాజన్న 8వ వార్డు

కమిషనర్: గతంలో ఇచ్చిన పర్మిషన్‌ల గురించి మున్సిపల్ కార్యాలయంలో రికార్డులు లేవు. పూర్తిగా పరిశీలించి పైఅధికారులకు తెలియజేస్తా. పర్మిషన్ లేకుంటే చర్యలు తీసుకుంటా.

ప్రశ్న: సైడుకాల్వలు శుభ్రం చేయక మూడు నెలలు అవుతోంది. – సయ్యద్‌జానీ 7వ వార్డు

కమిషనర్: రేపే కాల్వలు శుభ్రం చేయిస్తా. శుభ్రం చేయక నిర్లక్ష్యం చేసిన అధికారులను అప్రమత్తం చేస్తా. స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా.

ప్రశ్న: బస్టాండ్ సమీపంలో పండ్ల బండ్లు పెట్టడం, అక్కడే ఆటో స్టాండ్ ఉండడం ప్రయాణికులకు తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. – అనంతగిరి రవి 3వ వార్డు

కమిషనర్: రోడ్డుపై ఏర్పాటు చేసిన పండ్ల బండ్లను తీసి వేయిస్తా. స్థానికంగా పరిశీలించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటా.

ప్రశ్న: ఎస్సీ కాలనీలో కాల్వల్లో మురుగు తీయడం లేదు. విద్యుత్ వైర్లు చేతికి అందే విధంగా ఉన్నాయి. – బాషిపంగు రవికాంత్ 11వ వార్డు

కమిషనర్: తక్షణమే కాల్వలు శుభ్రం చేయిస్తా. విద్యుత్ అధికారులతో మాట్లాడి విద్యుత్ వైర్లను సవరించేందుకు కృషి చేస్తా.

ప్రశ్న: కోతులు, కుక్కల బెడదతో ఇళ్లలో ఉండే పరిస్థితి లేదు. కాలనీలో కోతులు, కుక్కల బెడదతో నివాస గృహాల్లో ఉండలేని పరిస్థితి ఉంది. పాలకులు స్పందించి చర్య తీసుకోవాలి. – షేక్ అమీన్‌పాషా, 9వ వార్డు

కమిషనర్: కోతులు, కుక్కల బెడద నుంచి రక్షించే ప్రయత్నంలో ఉన్నాం, జిల్లా కేంద్రంలో ఏబీసీ సెంటర్ ఉంది. అక్కడి నుంచి వ్యాక్సిన్ తెప్పించి కుక్కలు, కోతుల బెడద నుంచి కాపాడేందుకు చర్యలు తీసుకుంటా.

విశ్వవసు.. ఉగాది



తెలుగు వారి నవ్య సంవత్సరపు స్వాగతం..
కొత్త ఆశలతోరణం..
విశ్వవసు నామధేయం..
ఉగాది పచ్చడితో తొలి ఉషోదయం..
ప్రకృతి తల్లి అందించిన విశిష్ట శాస్త్ర ప్రసాదం..
షడ్రుచుల సంగమం..
జీవిత అనుభవాల మిళితం..
సంస్కృతి సంప్రదాయాలకు
నెలవుగా నిలిచి..
పంచాంగం శ్రవణం భవిష్యత్ కాల
ఆగమనం తెలిపి..
కోయిల స్వరాల తీయదనం
కవి సమ్మేళనంలో నిలిపి..
లక్ష్యసాధనలో ప్రతి అడుగు సాగాలి
కాలంతో కలిసి..
– వై.రమ్య, డోర్నకల్

ప్రాధాన్యం ఇవ్వడం లేదు

బయ్యారం: అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ గెలుపు కోసం కష్టపడిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు శనివారం కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు వినతిపత్రం అందజేశారు. నాయకులు నాగేందర్, సైదులు, సునీల్ ఉన్నారు.

పట్టణ ప్రజలు ఉత్సవాల్లో పాల్గొనాలి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మహబూబాబాద్ రూరల్: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ శ్రీరామ ఆలయంలో జరుగనున్న 67వ శ్రీసీతారామ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవ ఆహ్వాన కరపత్రాలను ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. సీతారాముల కల్యాణ ఉత్సవ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే మురళీనాయక్ చర్చించి ఆదివారం నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు జరగనున్న రాములోరి కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. పట్టణ ప్రజలు ఉత్సవాల్లో పాల్గొని రాములవారి కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఓం నారాయణ లోయ, ఎడ్ల రమేష్, పద్మం ప్రవీణ్ కుమార్, లక్ష్మీనారాయణ, ఇంద్రసేనారెడ్డి, పోతురాజు రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

కేసముద్రం: కొత్తగా ఏర్పాటైన కేసముద్రం మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి శనివారం ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశాడు.

పేదల సొంతింటి కల నెరవేరుస్తా..

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



పెద్దవంగర: ఇందిరమ్మ ఇల్లుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పెద్దవంగర: పేదల ప్రజల సొంతింటి కల నెరవేరుస్తానని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శనివారం మండలంలోని పోచారం పరిధిలోని రేఖ్యాతండాలో శంకుస్థాపనల కార్యక్రమాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు మద్దెల యాకయ్య, మండల అధ్యక్షుడు సురేష్, గోపాల్ నాయక్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు.. శనివారం మండలంలోని మడిపెల్లి గ్రామానికి ఈజీఎస్ ద్వారా మంజూరైనా రూ.12 లక్షల నిధులతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

తొర్రూరు: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం రాత్రి డివిజన్ కేంద్రంలోని మసీదుల ఇఫ్తార్ విందులో పాల్గొని ఉపవాస దీక్షను విరమింపజేశారు.

ప్రాజెక్టు రీడిజైన్‌పై విచారణ చేపట్టాలి



అభివాదం చేస్తున్న నాయకులు

గార్ల: సీతారామ ప్రాజెక్ట్ రీడిజైన్‌లో జరిగిన భారీ అవినీతి, అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం గార్లలో అఖిలపక్షం నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. 2016 సంవత్సరంలో ఇల్లెందు నియోజకవర్గంలోని రోళ్లపాడులో సీతారామ ప్రాజెక్టుకు నాటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయగా, ఈ ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో ప్రతిపాదిత ప్రాజెక్ట్ నమూనా మొత్తాన్ని మార్చేసి ఇల్లెందు నియోజకవర్గానికి నీళ్లు ఇవ్వకుండా తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు ప్రాజెక్ట్ నమూనాను పూర్తిగా మార్చేసి, ఈ నీటిని పాలేరు, ఖమ్మం, వైరా, కల్లూరు, సత్తుపల్లి ప్రాంతాలకు తరలించి, ఇల్లెందు నియోజకవర్గానికి అన్యాయం చేశారన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాస్, లక్ష్మణ్‌నాయక్, విశ్వ, వెంకట్‌రెడ్డి, సక్రు పాల్గొన్నారు.

వైద్య వృత్తి పవిత్రమైంది..



మురళీధర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్, తదితరులు

నెల్లికుదురు సెంటర్: సమాజంలో వైద్య వృత్తి చాలా పవిత్రమైందని, పేద ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించినప్పుడే వారి గుండెల్లో నిలిచిపోతారని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న డాక్టర్ మురళీధర్ దంపతులను శనివారం సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ డీఎంహెచ్‌ఓలు హరీశ్‌రాజ్, శ్రీరాం, అంబరీష, కళావతి, పీఓలు డాక్టర్ బిందు, డాక్టర్ సారంగం, నాగేశ్వర్‌రావు, లక్ష్మీనారాయణ, డాక్టర్ సుధీర్ రెడ్డి, మాజీ మంత్రి దయాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కాషాయ జెండా ఎగురవేద్దాం..

మహబూబాబాద్ రూరల్: ఉగాది పండుగ సందర్భంగా ప్రతి హిందువు తమ ఇంటిపై ఓంకారంతో కూడిన ఒక కాషాయ జెండా ఎగురవేయాలని కార్యక్రమ నిర్వాహకురాలు ఇందుభారతి కోరారు. జిల్లా కేంద్రంలోని ఓంకారం జెండాను ఇందుభారతి ఆవిష్కరించి మాట్లాడారు.

అకౌంట్‌కు నగదు

గార్ల: గుమ్మడి మహేష్ కుటుంబానికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కాంపెన్సేషన్ రూ.4,12,500 నగదును కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ కుటుంబ సభ్యుల అకౌంట్‌కు పంపినట్లు బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గుండెబోయిన నాగమణి తెలిపారు. శనివారం సీతంపేట గ్రామంలో ఆమె మాట్లాడారు.

రూ.30వేల ఆర్థికసాయం

గార్ల: ఇటీవల ట్రాక్టర్ కింద పడి మృతిచెందిన 9వ తరగతి విద్యార్థి సాయికుమార్ కుటుంబ సభ్యులకు పాఠశాల ఉపాధ్యాయులు కలిసి రూ.30వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎంఈఓ వీరభద్రం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం విలీనసభ

నెల్లికుదురు సెంటర్: జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 1వ తేదీన జరగనున్న భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్రస్థాయి విలీనసభను జయప్రదం చేయాలని రెండు సంఘాల రాష్ట్ర అధ్యక్షులు అనురాధ, గంట నాగయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని భట్టు అంజయ్యభవన్‌లో శనివారం సంఘాల సమావేశాన్ని నిర్వహించారు.

సమస్యలపై ఉద్యమించాలి

గూడూరు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సమస్యల పరిష్కారం కోసం బామ్‌సెఫ్ సహకారంతో ఉద్యమించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, న్యాయవాది భూక్య సురేష్‌నాయక్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఏప్రిల్ 5వ తేదీన స్థానిక సరయు డిగ్రీ కళాశాలలో జరగనున్న బామ్‌సెఫ్ క్యాడర్ క్యాంపు కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని జరుపులతండా గ్రామానికి చెందిన జరుపుల నరసింహ తన ద్విచక్ర వాహనంపై శనివారం మహబూబాబాద్ వైపునకు వస్తున్నాడు. కురవి వైపునకు వెళ్తున్న ఓ కారు కలెక్టరేట్ సమీపంలో అతివేగంగా వచ్చి నరసింహ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కాగా వెంటనే ఎంజీఎంకు తరలించారు.

యువత సన్మార్గంలో నడుచుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, మంచి సన్మార్గంలో నడుచుకోవాలని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాకర్స్ కాఫీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన హారిజెంటల్ బార్ ప్రారంభించారు. అనంతరం సీఐని సన్మానించారు.

ముస్లింల అభ్యున్నతికి పెద్దపీట

డోర్నకల్: కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి పెద్దపీట వేస్తుందని ఎంపీ పోరిక బలరాంనాయక్ పేర్కొన్నారు. శనివారం డోర్నకల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును ఎంపీ ప్రారంభించారు.

అధునాతన పద్ధతుల్లో సాగు చేయాలి

మహబూబాబాద్ రూరల్: రైతులు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అధునాతన పద్ధతులను అనుసరించి పంటలను సాగు చేయాలని మల్యాల కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మాలతి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో శనివారం రైతు సదస్సు నిర్వహించారు.

నల్లబెల్లం పట్టివేత

మరిపెడ రూరల్: అక్రమంగా తండలిస్తున్న 10.5క్వింటాళ్ల నల్లబెల్లం, ఒక క్వింటా పటికను పట్టుకుని స్వాధీన పర్చుకుని, ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంతోష్ శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని స్టేజితండా సమీపంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా అదే గ్రామ పంచాయతీకి పరిధిలోని మేగ్యతండాకు చెందిన భూక్య వెంకన్న, వాల్యతండాకు చెందిన తేజావత్ నాన్య, నర్సింహులపేట మండల గోపతండాకు చెందిన అజ్మీక కోటయ్యలు ఓ వాహనంలో 10.5 క్వింటాళ్ల నల్లబెల్లం, క్వింటా పటికను తరలిస్తుండగా పట్టుకుని స్వాధీన పర్చుకున్నట్లు ఎస్సై తెలిపాడు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కక్ష సాధింపు చర్య మానుకోవాలి

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే పలువురు వ్యక్తులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సబ్ జైలులో ఉన్న ఓ పత్రిక విలేకరిని దయాకర్ రావు శనివారం పరామర్శించారు. నాయకులు రామ్మోహన్ రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్ రెడ్డి, రంజిత్, రఘు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఎల్లేష్



దంతాలపల్లి: తొర్రూరు బార్ అసోషియేన్ జాయింట్ సెక్రటరీగా మండలంలో దాట్ల గ్రామానికి చెందిన మిడుతపల్లి ఎల్లేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు.

క్రైం కార్నర్..

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్య

పెద్దవంగర: మద్యానికి భార్య డబ్బులు ఇవ్వలేదని భర్త ఉరి వేసుకొని మృతి చెందాడు. ఈసంఘటన మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొరిపల్లి గ్రామానికి చెందిన రంగు రమేశ్ గౌడ్ (35) డ్రైవర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై నిత్యం తాగుతుండేవాడు. ఈక్రమంలో శనివారం మద్యానికి డబ్బులు కావాలని భార్యను అడిగాడు. ఆమె డబ్బులు లేనవి చెప్పడంతో ఇంట్లో భార్య, పిల్లలను ఉంచి ఇంటి ముందు ఉన్న వరండాలోని రేకుల షెడ్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. భార్య సరస్వతి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతిడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

తండ్రిని కొట్టాననే మనస్తాపంతో కొడుకు..

కురవి: ఇంట్లో తల్లిదండ్రులు గొడవ పడుతుండగా కోపంతో తండ్రిని కొట్టి నెట్టివేశాడు.. తన తండ్రిని కొట్టాననే.. మనస్తాపంతో కొడుకు రేపాల భిక్షపతి(22) ఆత్మహత్యకు పాల్పడిన విషాధకర సంఘటన సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కాంపల్లి గ్రామానికి చెందిన రేపాల రాజు, రాధికల కుమారుడు భిక్షపతి, కుమార్తె గంగోత్రి ఉన్నారు. ఈనెల 16న భార్యాభర్తలు ఓ కార్యక్రమానికి వెళ్లి, ఇంటికి వచ్చి గొడవపడ్డారు. ఈ క్రమంలో అమ్మను ఎందుకు తిడుతున్నావు అని తండ్రిని కుమారుడు భిక్షపతి అడిగాడు. తల్లిని కొడుతున్న తండ్రిని చెంపమీద కొట్టి నెట్టడంతో గోడకు తగిలి కిందపడ్డాడు. దీంతో తండ్రిని నెట్టి, కొట్టాననే మనస్తాపానికి గురైన భిక్షపతి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి పడుకున్నాడు. బయట పడుకున్న కొడుకును తండ్రి రాజు లేపి ఇంట్లో పడుకో అన్నాడు. తెల్లవారుజామున భిక్షపతి వాంతులు చేసుకున్నాడు. పక్కనే పురుగుల మందు డబ్బా చూసిన తల్లిదండ్రులు స్థానిక ఆర్ఎంపీ వైద్యుడిని పిలిపించి చూపించారు. పురుగుల మందు తాగాడు అని చెప్పడంతో వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీరోలు ఎస్సై నగేష్ తెలిపారు.

దాడి కేసులో ఒకరి అరెస్టు

గూడూరు: కత్తితో దాడి చేసిన కేసులో ఒకరిని అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై బి.గిరిధర్‌రెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని జంగుతండా శివారు రాజ్యతండాకు చెందిన మూడు బాలు, తన అన్న మూడు లింగాతో తరచూ గొడవపడుతూ చంపుతానని బెదిరించేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇద్దరు అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవలో మూడు బాలు కత్తితో అన్నపై దాడి చేశాడు. ఈ కేసులో బాధితుడు మూడు లింగా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారించి, రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘన.. కేసు నమోదు

నెల్లికుదురు: గుడుంబా తయారు చేసి విక్రయించి బైండోవర్ చేయగా బైండోవర్‌ను ఉల్లంగించిన కేసులో ఒకరికి జరిమానా విధించినట్లు తొర్రూరు ఎక్సైజ్ ఎస్సై రవళిరెడ్డి శనివారం తెలిపారు. మండలంలోని రాజుల కొత్తపల్లి గ్రామానికి చెందిన పెరుమాండ్ల సుజాత గుడుంబా కేసులో ఒకసారి తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు తెలిపారు. మళ్లీ గుడుంబా విక్రయిస్తూ పట్టుబడిన సుజాతకు రూ.50వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

భూ వివాదంలో వ్యక్తికి రిమాండ్

పెద్దవంగర: భూవివాదంలో సోదరుడిని చంపుతానని బెదిరించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన కొండ సతీష్ అన్నయ్య కొండ సమ్మయ్యకు మధ్య కొంతకాలంగా భూవివాదం కొనసాగుతుంది. సోదరుడు సమ్మయ్య ఉపాధి వెతుక్కుంటూ కుటుంబంతో హైదరాబాద్‌కు వెళ్లాడు. ఆయన భూమిని తమ్ముడు సతీష్‌కు కౌలుకు ఇచ్చాడు. అన్న సమ్మయ్య హైదరాబాద్‌కు వెళ్లడాన్ని అదునుగా భావించి సదరు భూమిని కాజేయాలని యత్నించాడు. దీంలో భాగంగా సమ్మయ్యను భూమి మీదికి రాకుండా అడ్డగించాడు. అడ్డు వచ్చిన వదినతో దుర్భాషలాడాడు. సోదరుడిని కొట్టడానికి యత్నించడమే కాకుండా చంపుతానని బెదిరించాడు. ఇటీవల సమ్మయ్య సతీష్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపిన పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. తొర్రూరు జడ్జి మట్ట సరిత తీర్పు మేరకు అతడికి రిమాండ్ విధించారు.